క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న బేడ, బుడగ జంగం సంఘం నాయకులు

సాక్షి, భీమవరం : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బేడ, బుడగ జంగం కులస్తులు మంగళవారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం హక్కుల పోరాట సమితి నాయకులు ఇంగువ వెంకటేశ్వరరావు, కుమార శ్రీనివాసరావు, కుమార చిన్న శ్రీను తదితరులు మాట్లాడుతూ తమ పిల్లలకు 2008 నుంచి కులధ్రువీకరణ పత్రాలు జారీ చేయకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి తెలియజేయాలని ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

శ్రీశ్రీ రచనలు సమాజానికి మార్గదర్శకం



మాట్లాడుతున్న సీతారామ్

సాక్షి, భీమవరం : శ్రీశ్రీ రచనలు, ఆలోచనలు నేటి సమాజానికి మార్గదర్శమని సాహితీవేత్త మంతెన సీతారామ్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ భాషా దినోత్సవం, రెడ్ బుక్ డే సందర్భంగా భీమవరం క్విట్ ఇండియా స్థూపం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శ్రీ శ్రీ సమాజంలో అన్ని అంశాలపై కవిత్వాన్ని అందరికీ అర్థమయ్యే భాషలో రాయగలిగారన్నారు. ఆయన రచనలు సినిమా రంగంలో కూడా ప్రాచుర్యం పొందడమేగాక దోపిడీ వ్యవస్థను చీల్చి చెండడాయన్నారు. కార్యక్రమంలో చైతన్య ప్రసాద్, చెరుకువాడ వెంకటరామయ్య, చాంద్ భాషా, ఆనందరావు, బి.బలరాం, వాసుదేవరావు, వైకుంఠరావు, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

మోటార్‌సైకిళ్ల వేలం



భీమవరం ఎక్సైజ్ స్టేషన్‌లో మోటారు సైకిళ్ల వేలం నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన 5 ద్విచక్ర వాహనాలకు మంగళవారం భీమవరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) స్టేషన్‌లో బహిరంగ వేలం నిర్వహించారు. ఈ 5 ద్విచక్ర వాహనాలకు రూ.39 వేలు ప్రభుత్వ ధర నిర్ణయించగా రూ.51,900కు వినియోగదారులు పాడుకున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ వీవీవీఎస్ఎస్ వర్మ చెప్పారు. అంతేగాకుండా జీఎస్‌టీ రూ.9,342 చెల్లించారని ఆయన వివరించారు.

నిత్యావసరాల అందజేత



పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : పేదరికం కారణంగా అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని డీవైఈవో శ్రీరామ్ అన్నారు. వన్‌టౌన్ ఏరియాలోని వివిధ ప్రాంతాల్లో అనారోగ్యం బారిన పడి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న నాలుగు కుటుంబాలకు మంగళవారం సిగ్నీ స్కూల్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు బాల్యం నుంచి విద్యతోపాటు క్రమశిక్షణ, పేదలకు సహాయం అందించే అలవాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి సంస్థ రేవతి, స్కూల్ ప్రిన్సిపాల్ పార్వతి సింగ్, అల్లు శ్రీనివాస్, సుంకర మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

పెనుమంట్ర: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నత్తారామేశ్వరం గ్రామంలోని రామేశ్వరస్వామి ఆలయానికి రూ. 9,15,770లు ఆదాయం సమకూరినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి యాళ్ల శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆలయ హుండీలను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తెరచి, లెక్కించినట్లు ఆయన తెలిపారు. హుండీ ద్వారా రూ. 5,06,448లు, దర్శనం, అభిషేకం టిక్కెట్లు, అన్నదానం విరాళాలు కలిపి రూ. 4,09,322లు లభించినట్లు ఆయన తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో కొఠాలపర్రు గ్రూపు దేవాలయాల ఈవో కె జానకిరామరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్, పెనుగొండ ఏఎంసీ డైరెక్టర్ కర్రి రామారెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు కర్రి చంద్రారెడ్డి, మల్లిడి కిరణ్‌కుమార్ రెడ్డి, కర్రి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

భీమవరం సుందరీకరణలో భాగస్వాములు కండి

దాతలకు కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి. ప్రశాంతి

భీమవరం (ప్రకాశం చౌక్) : భీమవరం పట్టణ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. మన ఊరు- మన భీమవరంపై మంగళవారం క్యాంపు ఆఫీసు నందు నాన్ గర్నమెంట్ అర్గనైజేషన్ వారితో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణాభివృద్ధిలో భాగంగా పార్క్‌లు, రోడ్ల అభివృద్ధి, డెవలప్‌మెంట్, శానిటేషన్ నిర్వహణ తదితర పనులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. పట్టణ సుందరీకరణకు దాతలు సహకరించాలని కోరారు. ఎవరైతే రోడ్డు అభివృద్ధి చేస్తారో ఆ రోడ్డుకు వారి పేరు పెడతామన్నారు. అలాగే ఒక రూ.లక్షకు మించి అభివృద్ధి కోసం సహాయం చేసేవారు ఉంటే తెలియజేయలన్నారు. రాజేష్ అనేదాత క్లాక్ టవర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఒమెక్స్ లేబొరేటరీ వారు డ్రెయినేజీ అభివృద్ధి చేస్తామన్నారు. కొందరు ఔత్సాహికులు పట్టణ అభివృద్ధికి పలు సూచనలు చేశారు. వి.వి.గార్డెన్స్‌లో రోడ్డులో లైట్లు ఏర్పాటు చేయడం, పట్టణంలో డ్రగ్స్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఎస్ఆర్‌కేఆర్ కళాశాల నుంచి ఆదర్శ నగర్ వరకు రోడ్డును 4 లైన్లు ఏర్పాటు చేసి మధ్యలో ఐ-ల్యాండ్ ఏర్పాటు, రోడ్డుకు ఇరువైపులా రెండు మీటర్లు మార్జిన్ ఏర్పాటు చేసి గ్రీనరీ డెవలప్‌మెంట్ చేయాలని, భీమవరం హాస్పిటల్ దగ్గర బస్ షెల్టర్ ఏర్పాటుకు కృషి చేయాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, పారిశ్రామికవేత్తాలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, దాతలు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం



సభలో మాట్లాడుతున్న రాష్ట్ర క్రిస్టియన్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు మేడిది జాన్సన్

భీమవరం అర్బన్ : ఏసుక్రీస్తు బోధనలు సమాజానికి అనుసరణీయమని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు మేడిది జాన్సన్ అన్నారు. తుందుర్రు గ్రామంలో మోక్ష మార్గోపదేశ సభలలో భాగంగా మంగళవారం ముఖ్యఅతిథిగా హాజరైన మేడిది జాన్సన్ దైవ సందేశం వినిపించారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు ఆశీర్వచనములు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించారు. అనంతరం క్రీస్తు గీతాలపాన చేశారు. విల్లూరి పద్మాస్ కుమార్, పి.సజీవరావు, పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు పాతపాటి సర్రాజు



సర్రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు

ఉండి: క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే దివంగత పాతపాటి సర్రాజు అందరి మనసుల్లో చిరస్మరణీయంగా నిలిచి ఉంటారని వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం ఉండి మండలానికి చెందిన వివిధ స్థాయి వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు సర్రాజు ఇంటికి చేరుకుని ఆయన కుమారులు శ్రీనివాసరాజు, యుగంధర్ వర్మలను పరామర్శించారు. అనంతరం సర్రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ, కార్పొరేషన్ డైరెక్టర్లు కొప్రపాటి అనిత, గులిపల్లి అచ్చారావు, మండల పార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, ముదునూరి ప్రసాదరాజు, వేగేశ్న రాంమకృష్ణంరాజు, సర్పంచ్ కొండవేటి సాంబశివరావు, కరిమెరక చంద్రరావు, గలావిల్లి ధనుంజయ, అంగర రాంబాబు, నిమ్మల కేశవకుమార్, రాయి సతీష్ పాల్గొన్నారు.

23న ఉండి ఏఎంసీలో సర్రాజు సంతాప సభ

ఈ నెల 23న గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఉండి వ్యవసాయ మార్కెట్ యార్డులో క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు సంతాప సభ నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు.

సర్రాజుకు ఘన నివాళులు

ఆకివీడు: ఘనమైన నివాళులర్పించడం ద్వారా క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు ఆత్మకు శాంతిని చేకూర్చుదామని ఉండి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు నిర్ణయించారు. భీమవరంలోని ఆదర్శ నగర్‌లోని సర్రాజు నివాసం వద్ద మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో ఉండి మార్కెట్ యార్డు ప్రాంగణంలో శనివారం సంతాప సభలు నిర్వహించాలని నిర్ణయించారు. ఆకివీడు మండలం నుంచి జెడ్పీటీసీ యండగండి శ్రీను, నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, నంద్యాల సీతారామయ్య, జగ్గరోతు విజయ్‌కుమార్, పుప్పాల పండు, జీ.ధనరాజు, గుండా సుందరరామనాయుడు, గేదెల అప్పారావు, దొడ్డి జగదీష్, ఉండి మండల నాయకులు గులిపల్లి అచ్చారావు, రణస్థల మహంకాళి, కరిమెరక రామచంద్రరావు, కొప్రపాటి అనిత, అంగర రాంబాబు, కాళ్ల మండలం నుంచి జెడ్పీటీసీ పశ్చిగోళ్ల సోమేశ్వరరావు, కొపల్లె, కలవపూడి సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయరామకృష్ణంరాజు, పెన్మెత్స ప్రసాదరాజు, మన్నే నాగరాజు, పాలకోడేరు మండలం నుంచి కటిక శ్రీదేవి, స్మైల్ డెంటల్ ఆసుపత్రి అధినేత, డాక్టర్ పాతపాటి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

24 నుంచి వేండ్ర రైల్వే గేటు మూసివేత

పాలకోడేరు: పాలకోడేరు వేండ్ర గ్రామాల మధ్య రైల్వే గేటు వద్ద మరమ్మతుల నిమిత్తం ఈ నెల 24న ఉదయం నుంచి 7 గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం వరకు అనగా 4 రోజుల పాటు గేటును మూసి వేస్తామని రైల్వే అధికారులు తెలిపారు. ప్రజలు ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గం ద్వారా ప్రయాణించి తమకు సహకరించాలని కోరారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం

పాలకోడేరు: స్నేహితుడి మరణంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అతని కుటుంబానికి పూర్వ విద్యార్థులంతా అండగా నిలిచారు. శృంగవృక్షం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1992–1997 సంవత్సరంలో చదువుకున్న విద్యార్థుల్లో ఒకరైన బసెట్టి నాగరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. నాగరాజు మృతితో ఒంటరైన అతని తల్లి సత్యవతి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుసుకున్న పూర్వ విద్యార్థులంతా కలిసి మంగళవారం ఆమెకు రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సవరం సత్యకృష్ణ, పంపన నాగేశ్వరరావు, ఖండవల్లి సతీష పిట్టా యేసు, గరికిపాటి నాగరాజు, తాడి విజయానంద్, చింతా విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజల వద్దకే వైద్య సేవలు

పాలకోడేరు: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించేలా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో భాగంగా ప్రజల ముంగిటే నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ స్వర్ణ నిరంజని అన్నారు. పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రంగం నాయుడు సూచనలతో గొరగనమూడి హెల్త్ క్లినిక్ సెంటర్ వద్ద మంగళవారం గొరగనమూడి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ స్వర్ణ నిరంజని తదితరులు రోగులకు బీపీ, సుగర్ తదితర పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. ఆహార నియమాలు వివరించారు. గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సూపర్‌వైజర్ శంకర్, చండీరాణి, ఎమ్ఎల్‌హెచ్‌పి రోమోలా, హెల్త్ అసిస్టెంట్‌పి విజయ ప్రసాద్, ఏఎన్ఎంలు వేదకుమారి, సుజాత ఆశా వర్కర్లు 104 సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

సాక్షి, భీమవరం : గ్రామ పంచాయతీ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా పోరాడిన ఫలితంగా ప్రభుత్వం విడుదల చేసిన జీవోలను తక్షణం అమలు చేయాలని ఏపీ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇంటి వెంకటేశ్వరరావు కోరారు. మంగళవారం భీమవరంలో నిర్వహించిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019లో కార్మికులకు గుర్తింపు కార్డులు, కనీస వేతనం, పీఎఫ్ ఈఎస్ఐ వంటి సౌకర్యాలు అమలు చేసే విధంగా జీవో 132 ప్రభుత్వం జారీ చేసిందని, అలాగే 2022 జనవరి నుంచి నెలకు రూ.10 వేలు జీతం చెల్లిస్తామంటూ మరొక జీవో 2021 అక్టోబర్‌లో జారీ చేసిందన్నారు. వీటిని రెండు జీవోలు నేటికీ అమలుకు నోచుకోలేదని వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి చింతా రాజారెడ్డి అధ్యక్షత వహించగా సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ఎం.ఆంజనేయులు, రాజబాబు, కిరణ్ పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుపై విచారణ



మాట్లాడుతున్న నీటి యాజమాన్య సంస్థ ఏపీడీ విజయలక్ష్మి

ఆకివీడు: కాళ్లలో శ్మశాన వాటిక అభివృద్ధికి ప్రజా విరాళంగా చెల్లించిన సొమ్మును తిరిగి ఇప్పించాలని గ్రామానికి చెందిన పీ.నాగభూషణం, ఏ.దిలీప్‌కుమార్, పలువురు ఇచ్చిన స్పందన ఫిర్యాదుపై మంగళవారం విచారణ నిర్వహించారు. కాళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వీ.విజయలక్ష్మి విచారణ నిర్వహించారు. ఉపాధి హామీ పథకం ద్వారా 70 శాతం ప్రభుత్వ నిధులు, 30 శాతం ప్రజా విరాళంతో హిందూ శ్మశాన వాటికను నిర్మించామన్నారు. నిర్మాణ సమయంలో ప్రజా విరాళం రూ. 3 లక్షలు డీడీ రూపంలో 2019లో చెల్లించామన్నారు. ప్రజా విరాళంతో మాత్రమే శ్మశాన వాటికను అభివృద్ధి చేశారని, ప్రభుత్వ సొమ్ము విడుదల కాలేదని గ్రామస్తులు వివరించారు. గ్రామస్తులు చెల్లించిన విరాళం సొమ్ము రూ. 3 లక్షలైనా తిరిగి ఇస్తే మిగిలిన పనులు పూర్తి చేస్తామని వారు వివరించారు. విచారణలో వచ్చిన అంశాల్ని ఉన్నతాధికారులకు వివరిస్తానని ఏపీడీ హామీ ఇచ్చారు. ఎంపీడీఓ జీ.స్వాతి, ఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

పాలకోడేరు: పెన్నాడ గ్రామంలో అక్రమంగా కొనుగోలు చేసి నిల్వ ఉంచిన 1,200 కిలోల రేషన్ బియ్యాన్ని మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు

పేకాట స్థావరంపై దాడి

పాలకోడేరు: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కథనం ప్రకారం వేండ్ర గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందడంతో మంగళవారం ఎస్సై తన సిబ్బందితో కలిసి దాడి చేసి నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి రూ.1,850 నగదు స్వాధీనం చేసుకుని వారిని కోర్టులో హాజరు పరుస్తామని ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

మాతృభాష పరిరక్షణకు యువత నడుంకట్టాలి



పద్యకవి అప్పన్నను సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : మాతృభాషలో నైపుణ్యం, సామర్థ్యం మనిషి జీవన వికాసానికి, ఆలోచనశక్తిని పెంపొందించడానికి దోహదం చేస్తుందని పద్యకవి తియాదుల అప్పన్న అన్నారు. స్థానిక ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాతృభాష పరిరక్షణకు యువత నడుం కట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్ లక్ష్మీకాంతం మాట్లాడుతూ మాతృభాషా సాహిత్య పఠనం ద్వారా మానవ విలువలు పెరుగుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం అప్పన్నను ఘనంగా సత్కరించారు. కళాశాల అధ్యాపకులు పి.అరవిందస్వామి, కాకుమాని శ్రీనివాసరావు, పి.అమూల్యారావు, విజయ్‌కుమార్, మల్లేశ్వరి, శివ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పెద్ద మనసు



మహదేవపట్నంలో వృద్ధాశ్రమంలో సహాయం అందిస్తున్న బాలికలు, హెచ్‌ఎం సత్యనారాయణ

ఉండి: చిన్నారులు పెద్ద మనసుతో ఆశ్రమంలోని వృద్ధులకు అండగా నిలిచారు. ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఏడో తరగతి చదువుతున్న విద్యార్థులు తమకు తల్లిదండ్రులు ఇచ్చిన డబ్బును పొదుపు చేసి ఆశ్రమంలోని వృద్ధులకు రూ.4 వేలు ఆర్థిక సహాయం చేసి తమ పెద్ద మనసును చాటుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎంవీ సత్యనారాయణ మాట్లాడుతూ చిన్నారులకు చదువుతోపాటు మంచి గుణాలు నేర్పించాలనే ఉద్దేశ్యంతో వారికి ఇతరులకు సహాయపడాలని నేర్పించామన్నారు. దానిలో భాగంగానే బాలికలు తాము దాచుకున్న నగదును సహాయం కోసం ఎదురు చూస్తున్న వృద్ధులకు అందించారని అన్నారు. విద్యార్థులందరికీ ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఉపాధ్యాయుడు ఎస్ సుబ్బరాజు, విద్యార్థులు శిరీష, లావణ్య, సంయుక్త, మహలక్ష్మి పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం అర్బన్ : యువతి అదృశ్యంపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ప్రకారం మొగల్తూరు మండలం, కాళీపట్నం గ్రామానికి చెందిన వాతాడి ఏడుకొండలు రెండవ కుమార్తె మండలంలోని దెయ్యాలతిప్ప గ్రామంలోని పెద్దమ్మ వద్ద రెండు నెలలుగా ఉంటూ టైలరింగ్ నేర్చుకుంటుంది. ఈ నెల 20న టైలరింగ్ నేర్చుకోవడానికి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితులు ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై డి.మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమగ్ర సర్వేతో భూముల పరిరక్షణ



తుందుర్రు గ్రామంలో డ్రోన్ సహాయంతో భూ సర్వేను ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్ : ఆధునిక సర్వే టెక్నాలజీని అందిపుచ్చుకుని ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రెవెన్యూ పరిధిలోని సమస్త భూ రికార్డులను ఖచ్చితత్వంతో రీ సర్వే చేసే పనులు చురుగ్గా సాగుతున్నాయని సెంట్రల్ సర్వే ఏడీ జాషువా అన్నారు. భీమవరం మండలంలోని తుందుర్రు గ్రామంలో మంగళవారం సెంట్రల్ సర్వే ఏడీ జాషువా, సర్వే ఆఫ్ ఇండియా సభ్యులు వి.ప్రసాద్, సర్వే డీటీ ఎన్ఎస్ఎస్ ప్రసాద్, తహసీల్దార్ వై.రవికుమార్ డ్రోన్ సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా రైతులను వెంటాడుతున్న భూ సమస్యలను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమగ్ర భూ సర్వే చేయాలని నిర్ణయం తీసుకుని ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టారన్నారు. భూ రీ సర్వే పూర్తయ్యే సమయానికి ప్రస్తుతం ఉన్న భూ సమస్యలు పూర్తిగా తొలగిపోతాయన్నారు. సర్పంచ్ ఆరేటి వీరాస్వామి నాయుడు, మండల సర్వేయర్లు జి.నాగబాబు, రమాభాయి, వీఆర్‌వో పద్మనాభం, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

అమృత్ సరోవర్‌లో చెరువుల అభివృద్ధి



మొగల్తూరులో చెరువు పనులను పరిశీలిస్తున్న అధికారులు

మొగల్తూరు: అమృత్ సరోవర్ పథకంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న చెరువులను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని ఎంపీడీఓ ఆర్‌సి ఆనంద్ కుమార్ తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా అమృత్ సరోవర్ పథకంలో రూ.2,78,208తో చేపట్టిన స్థానిక బోది చెరువు అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ సరోవర్ పథకంలో చెరువులోని మట్టి పూడిక తీయడం, గట్లను అభివృద్ధి చేసి మొక్కలు నాటడంతో పాటు స్థానికులు వినియోగించుకునేలా వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. చెరువుల అభివృద్ధితో పాటు నీటి నాణ్యతా పరీక్షలు కూడా చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ నవీన్ కిరణ్, ఈసీ ఆనంద ఏపీఎం శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

భీమవరం అర్బన్ : దాడి ఘటనపై భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం కేసు నమోదైంది. వివరాల ప్రకారం దెయ్యాలతిప్ప గ్రామ పంచాయతీలోని వినాయకపురంలో తిరుమాని బాలకృష్ణ ఇంటి ఆవరణలోకి గొర్రెలు రావడంతో అతని భార్య దుర్గా భవానీ గొర్రెలు తోలిన వారిని మందలించింది. తిరుమాని మంగ, వాటాల చందమ్మ, ప్రవీణ్‌కుమార్ కలగజేసుకుని బాధితుడు తిరుమాని బాలకృష్ణ, అతని భార్య దుర్గాభావానీని కొట్టి గాయపరిచారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై డి.మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు తణుకులో జాబ్ మేళా

తణుకు టౌన్: ఈనెల 23వ తేదీన తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.ఎస్ వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తణుకులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తునికి చెందిన దక్కన్ ఫైన్ కెమికల్స్ ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు 2016- 2022 మధ్య కాలంలో కెమిస్ట్రీ సబ్జెక్ట్‌తో డిగ్రీ, పీజీ పూర్తి చేసిన పురుష అభ్యర్థులు హాజరు కావాలని కోరారు.

గూడెంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలి

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర విద్యాశాఖ మంత్రి అన్నపూర్ణదేవియాదవ్‌కు బీజేపీ నాయకురాలు బోగిరెడ్డి ఆదిలక్ష్మి వినతిపత్రాన్ని అందచేసినట్లు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా బోగిరెడ్డి మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేసినట్లయితే పట్టణ పరిసర ప్రాంతాల పేదలకు ఎంతో ఉపకయోగకరంగా ఉంటుందని తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి విద్యార్థులు కృషిచేయాలి



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో యూబీఏ కోఆర్డినేటర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : పట్టణాలతో సమానంగా గ్రామీణ ప్రాంతాలను సైతం విద్యార్థులు తమ విజ్ఞానంతో అభివృద్ధి చేసేందుకు సహకారం అందించాలని కేంద్ర ప్రభుత్వ ఉన్నత భారత్ అభియాన్ ఆంధ్ర యూనివర్సిటీ పరిధి ప్రాంతీయ కో–ఆర్డినేటర్ బి.పావని అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్నత భారత్ అభియాన్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని 30 కళాశాలకు చెందిన యూబీఏ కోఆర్డినేటర్లతో ఎయిమ్స్ అండ్ ఆబ్జెక్టివ్స్ ఆఫ్ యుబీఏ అనే అంశంపై నిర్వహించిన వర్క్ షాప్‌లో ఆమె మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో సమస్యలు తెలుసుకుని వాటి సాధనలో ప్రజలకు తోడుగా నిలిచి, నూతన సాంకేతికతను వారికి అందించడం ద్వారా వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. ప్రతి కళాశాల ఐదు పల్లెలను దత్తత తీసుకొని ముందుగా రక్షిత మంచినీరు, పారిశుద్ధ్యం, ప్లాస్టిక్ నిర్మూలన వంటి అంశాలలో ప్రజలను అప్రమత్తం చేయాలని పావని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగపతి రాజు మాట్లాడుతూ కొన్నేళ్లుగా తమ కళాశాల యుబిఎ సెల్ దత్తత గ్రామాల్లో పారిశుద్ధ్యం, రక్షిత మంచినీరుతో పాటు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం వర్క్‌షాప్‌లో పాల్గొన్న యూబీఏ కోఆర్డినేటర్స్‌కు కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు, జగపతి రాజు సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమానికి ఆర్.సుబ్బారావు అధ్యక్షత వహించగా ఆర్‌అండ్‌డీ డీన్, యూబీఏ కోఆర్డినేటర్ డాక్టర్ పీపీ రామకృష్ణంరాజు, వి.రామరాజు, టి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి, భీమవరం : భీమవరం డీఎన్నార్ కళాశాలలో ఉన్నత్ భారత్ అభియాన్‌పై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ బీఎస్ శాంతకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రాంతీయ సమన్వయకర్త బి.పావని మాట్లాడుతూ ఉన్నత్ భారత్ అభియాన్ కార్యక్రమం లక్ష్యాలు, ముఖ్య ఉద్దేశాలను వివరించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) మాట్లాడుతూ ఉన్నత్ భారత్ అభియాన్ ద్వారా విద్యార్థులు చదువుతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషిచేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందచేశారు. పరిపాలనాధికారి పి.రామకృష్ణంరాజు, ఎస్.అనిల్ దేవ్ తదితరులు పాల్గొన్నారు.